దేశ సైనికుల త్యాగం స్ఫూర్తిదాయకం



భీమవరంలో మాజీ సైనికులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భారత సైనికుల త్యాగం, ధైర్యమే నేటి తరానికి స్ఫూర్తిదాయకమని భీమవరం వన్ టౌన్ ఎస్సై ఎం వెంకటేశ్వరావు అన్నారు. క్విట్ ఇండియా స్థూపం వద్ద అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. సబ్‌ట్రెజరీ ఆఫీసర్ అల్లూరి రవి వర్మ మాట్లాడుతూ భారత సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా 19 మంది మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, ఉండపల్లి రమేష్ నాయుడు, విజ్జురోతి రాఘవులు, ముంతా రవి, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, కలిగొట్ల గోపాలశర్మ, కొండ్రు శ్రీనివాస్, సుంకరదాసు, పలువురు యువకులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ దివాస్ ర్యాలీ

శ్రీవిజ్ఞానవేదిక, డీఎన్నార్ ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్గిల్ విజయ దివాస్ ర్యాలీ నిర్వహించారు. డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజేష్ మాట్లాడుతూ భారతదేశ బలానికి, సహనానికి కార్గిల్ విజయగాథ నిదర్శనమని అన్నారు. ఎన్‌సీసీ మేజర్ ఎ.వీరయ్య మాట్లాడుతూ భారతదేశ సాయుధ దళాల ధైర్యం, పరాక్రమానికి ప్రతీక కార్గిల్ దివస్ అని చెప్పారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జవాన్ల త్యాగం త్యాగం మరువలేనిదన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.సోమరాజు తదిరతులు పాల్గొన్నారు.

భారత సైన్యం పోరాటం యువతకు స్ఫూర్తి

దేశంకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగా లు నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా వెంకటసత్య నారాయణ అన్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివాస్ 25వ వార్షికోత్సవ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాజీ సైనికులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్ కృష్ణ చైతన్య, బీజేపీ నాయకులు పేరిచర్ల సుభాష్, అల్లూరి సాయిదుర్గరాజు, అడబాల శివ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఉన్నమట్ల కపర్ది, కాయిత సురేంద్ర, కోమటి రవికుమార్ పాల్గొన్నారు.

నేడు వేండ్రలో ఉచిత పశు వైద్య శిబిరం

పాలకోడేరు: వేండ్ర గ్రామంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారిని డాక్టర్ హేమ తెలిపారు. ఈ శిబిరంలో గర్భకోశ వ్యాధులకు చికిత్స, లేక దూడలకు నట్టల నివారణ, గోమార్లకు చికిత్స, గొంతువాపు, ముద్ద చర్మవ్యాధి నివారణకు టీకాలు, కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేస్తామని శుక్రవారం ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని పశు యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

భీమవరం: పట్టణంలోని విస్సాకోడరు వంతెన వద్ద కె.బాలాజి తనను కొట్టాడంటూ కె.సూర్యనారాయణ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ శేషావతారం తెలిపారు.

క్లుప్తంగా

మహిళా సాధికారత కోసం 'మిషన్ శక్తి'


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మిషన్ శక్తి వంద రోజులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం కోపల్లెలో శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కాళ్ల సెక్టార్ కోపల్లె గ్రామంలో సదస్సు నిర్వహించి అవగాహన కల్పించినట్లు సూపర్‌వైజర్ సూర్య కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ శక్తి పథకం మహిళల సాధికారత కోసమేనని, బాలికల రక్షణ, విద్య, లింగ నిర్ధారణను నివారించేందుకే బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లింపుపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

భీమవరం: ఆదాయ పన్ను చెల్లింపుదారులు, నిరాధారమైన క్లయిమ్స్ చేయకుండా నిబంధనల మేరకు ఐటీఆర్ ఫైలింగ్ చేయాలని ఆదాయ పన్ను శాఖాధికారి కొణతం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్ఐసీ కార్యాలయంలో డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారి, ఎస్టాబ్లిస్‌మెంట్ క్లర్క్స్, ఎల్ఐసీ ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఐటీఆర్ ఫైలింగ్, ట్యాక్స్ చెల్లింపుదారుల బాధ్యతలు, పన్ను ఎగవేత, తప్పుడు రిఫండ్ క్లెయిమ్స్, ఇన్‌కమ్‌టాక్స్ ఫైలింగ్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఐటీఆర్‌లను ఈనెల 31వ తేదీలోపు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలి


వెంపలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్: ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులు సరిగాలేని కేంద్ర బడ్జెట్‌ను ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం వెంప గ్రామంలో సీపీఎం నాయకులు కేంద్రబడ్జెట్‌ను వ్యతిరేకించాలని శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ కార్పొరేటర్లకు రాయితీలిచ్చే విధంగా ఉన్నదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్, పోలవరం నిర్వాసితుల సమస్యల ప్రస్తావన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు, రైతులకు అనుగుణంగా బడ్జెట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తోటి శుభాకర్‌రావు, వేగి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన సదస్సు

పాలకోడేరు: అపరిచిత వ్యక్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి అన్నారు. మిషన్ శక్తి వంద రోజులు అవగాహన కార్యక్రమంలో భాగంగా పాలకోడేరులో శుక్రవారం అంగన్‌వాడీ సెంటర్ వద్ద మహిళలకు, హైస్కూల్ విద్యార్థినులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికలకు మహిళా చట్టాలు, బాల్య వివాహ నిరోధక చట్టం, దిశ చట్టాలను వివరించారు. సచివాలయ మహిళా పోలీసులు లలిత, శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, అనంతలక్ష్మి, ధనలక్ష్మి, వెంకటరమణ శాంతకుమారి, విమల తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అన్ని వయస్సుల వారు సుగర్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని, తరచూ మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా కో–ఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య అధ్యక్షతన స్థానిక ఆర్అండ్‌బీ గ్రౌండ్‌లో శుక్రవారం ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ శారీరక వ్యాయామం, ఆహారపు అలవాట్లు, మార్పులు, నడక యోగ వంటివి చేస్తూ సుగర్‌ను నియంత్రించుకోవాలని అన్నారు. సభ్యులు కంచర్ల నరసింహ, మానేపల్లి కిరణ్, అపర్ణప్రసాద్, గాజుల మురళీకృష్ణ, డి.ముఖర్జీ, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆకివీడు వనువులమ్మవారికి ఆషాఢ సారె సమర్పిస్తున్న మహిళలు

ఆకివీడు: ఆషాఢ మాస శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, సారెలు సమర్పించారు. స్థానిక వనువులమ్మ అమ్మవారి ఆలయంలో ఉపేంద్ర భజన మండలి ఆధ్వర్యంలో మహిళలు వివిధ రకాల పిండి వంటలు, స్వీట్లు, చీర,జాకెట్, పసుపు కుంకుమ, గాజులు, పండ్లు ఊరేగింపుగా తీసుకువెళ్లి అందజేశారు. స్థానిక గంగానమ్మకోడులోని మారెమ్మవారిని, గుమ్ములూరు రోడ్డులోని దానేశ్వరి అమ్మవారిని కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. అజ్జమూరులోని జనార్ధన స్వామి ఆలయంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

విద్యార్థులకు కంచాల పంపిణీ

భీమవరం: స్థానిక తాడేరు రోడ్‌లోని జీఎంసీ బాలయోగి మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు రామాయణం సుధీర్ ఆర్థిక సాయంతో స్టీల్ కంచాలు, వాటర్ బాటిల్స్, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. హెచ్ఎం రంగనాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరం 36వ వార్డులోని రామాయణం రాజశేఖర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రామాయణం వెంకటలక్ష్మి తులసీపార్వతి, ఇందుకూరి శివాజీవర్మ, హిప్నాటిస్ట్ ఉమాచంద్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలే అభివృద్ధికి మార్గాలు


ఉండి జాబ్‌మేళాలో మాట్లాడుతున్న దివ్య కళాశాల డైరెక్టర్ దుర్గారావు, వివిధ కంపెనీల ప్రతినిధులు

ఉండి: అందుబాటులోకి వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటేనే భవిష్యత్తులో అభివృద్ధి సాధించగలమని దివ్య కళాశాల డైరెక్టర్ కె.దుర్గారావు అన్నారు. శుక్రవారం ఉండి దివ్య కళాశాలలో జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాబ్‌మేళాకు వివిధ జిల్లాల నుంచి 290 మంచి నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 115 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ దుర్గారావు మాట్లాడుతూ కళాశాలలో జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించామని అన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, డిప్లమో, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ అర్హత కలిగిన అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో అనేక దిగ్గజ కంపెనీల ప్రతినిధులు హాజరై నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేసుకున్నారని అన్నారు. అనంతరం ఎంపికైనవారికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే రాంబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టీ సూర్యనారాయణ, లెక్చరర్స్, వివిధ కంపెనీల హెచ్ఆర్‌లు, ప్రతినిధులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రగ్గులు, కంచాల పంపిణీ


బాధితులకు స్టీలు ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు దాతల సహకారం ఎంతైనా అవసరమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక రెండో వార్డులో వరద బాధితులకు వివేకానంద సేవా సమితి సహకారంతో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రగ్గులు, బుక్స్, స్టీల్ ప్లేట్లు, గ్లాసులను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పదేళ్లుగా వివేకానంద సేవాసమితి చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 250 మంది ముంపు బాధితులకు సేవా సమితి సహకారంతో రగ్గులు, 66 మంది చిన్నారులకు గ్లాస్‌లు, పుస్తకాలు, బిస్కెట్లు అందించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు, సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు వేగిరాజు శివవర్మ, నారాయణరాజు, కంతేటి వెంకట్రాజు, నందమూరి రాజేష్, వబిలిశెట్టి రామకృష్ణ, వీఆర్వో అడపా శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాలకు బీబీఏ కోర్స్

భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బీబీఏ కోర్స్ ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. ఉన్నత విద్యామండలి నుంచి అనుమతి రావడంతోపాటు వెబ్ ఆప్షన్‌లో కూడా ఎస్ఆర్‌కేఆర్‌ను పొందుపర్చినట్టు చెప్పారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


వెంపలో మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మీకాంతం

భీమవరం అర్బన్: బాల్య వివాహాలు చేసినా, మహిళలను వేధించినా, వారిపై దాడులు చేసిన చట్టరీత్యా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని భీమవరం సీడీపీఓ టీకేవీ లక్ష్మీకాంతం హెచ్చరించారు. భీమవరం మండలం వెంప అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం మిషన్ శక్తి పథకంపై మహిళలు, తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతం మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసిన వారిపైనా, సహకరించిన వారిపైనా కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. చిన్నవయస్సులో గర్భం దాల్చడం వల్ల తల్లి, బిడ్డకు ఆరోగ్య పరంగా అనర్థాలే జరుగుతాయని తెలిపారు. మహిళలను వేధించినా, వారిపై దాడులు, అత్యాచారాలకు పాల్పడినా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అనిల్ కుమారి, ఆశా వర్కర్లు, తల్లులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. దిరుసుమర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి కార్యక్రమంలో మహిళా చట్టాలపై సూపర్‌వైజర్ అనిల్‌కుమారి అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సిబ్బంది డి.దయామణి, ఎ.బేబిరాణి, ఐ.కేశవలక్ష్మి, కె.మీనాక్షి, ఎస్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ మెషీన్ సరఫరాకు టెండర్లు

భీమవరం: తాడేపల్లిగూడెంలోని పురుగు మందుల పరీక్ష ల్యాబ్‌కు అవసరమైన గ్యాస్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ మెషీన్ సరఫరా చేయడానికి స్వల్ప కాలిక టెండర్లకు ఆహ్వానిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల బిడ్డర్లు ఇఎండీ రూ.2 లక్షలు ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం లోపుగా డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్స్ చెక్‌ను సమర్పించాలని పేర్కొన్నారు. టెండరు డాక్యుమెంట్లను కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందించాలని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 83310 56658లో సంప్రదించాలని జేసీ పేర్కొన్నారు.

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం సాధించాలి


ఈస్టుపాలెం స్కూల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో విద్యార్థులు


ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ఉపయోగించిన విద్యార్థిని అభినందిస్తున్న డీవైఈఓ శ్రీనివాసరావు

ఆకివీడు: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు ఎంపీపీ పాఠశాలల్లో సాంకేతిక నైపుణ్యంపై వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని దుంపగడప జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీవైఈఓ శ్రీనివాసరావు పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల తెలివితేటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని అవగాహన చేసుకోవాలని సూచించారు. బోధనలో భాగంగా ఇంటరేక్టివ్ ప్లాట్ ప్యానల్ ఉపయోగించే తీరును విద్యార్థి నిమ్మల కుమార్ హర్ష ప్రతాప్ వివరించడంతో డీవైఈఓ అభినందించారు. విద్యార్థులకు శిక్షణనిస్తున్న ఉపాధ్యాయులు విజయకుమార్, తోట రమేష్, హెచ్ఎం ఎస్.ప్రసాద్‌ను అభినందించారు. ఈస్టుపాలెం స్కూల్లో విద్యార్థులు వివిధ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అజ్జమూరు గరువులోని ఎంపీపీ స్కూలును వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శ్రీనివాస్ సందర్శించి విద్యార్థులకు వ్యవసాయ సాగు, పాడి పంటలు, హార్టీ కల్చర్, ప్రకృతి పరిరక్షణపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: కాళ్ల విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అహ్మద్ ఖాన్ శుక్రవారం తెలిపారు. కాళ్ల, కోలనపల్లి సీసలి, కోమటిగుంట, దొడ్డనపూడి, కాళ్ల కూరు ,గ్రామాలతోపాటు ఉండి మండలం చిన్నపుల్లేరు, పెద్ద పుల్లేరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించండి


పెదపుల్లేరులో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాయిచంద్ర

ఉండి: సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలంతా అప్రమత్తం ఉండాలని మండల వైద్యాధికారి ఉండి పీహెచ్‌సీ డాక్టర్ భీ సాయిచంద్ర అన్నారు. శుక్రవారం ఉండి మండలం పెదపుల్లేరులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయిచంద్ర మాట్లాడుతూ పరిసరాల ప్రభావంపైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని అన్నారు. అందుకే ఎల్లప్పుడూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సాధారణంగా వర్షాకాలంలో ఎక్కువగా ప్రభావం చూపించే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా, పాగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ,గ్రామస్తులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

అత్తిలి: పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం శ్రీదేవి హెచ్చరించారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో మిషన్‌శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. శ్రీదేవి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట ప్రకారం నేరమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ఆర్‌కే కుమారి, ఎం వెంకటలక్ష్మి, జి.నాగజ్యోతి, మహిళా సంరక్షణ కార్యదర్శి జానకి పాల్గొన్నారు.

బాలికలను చదివించాలి

తణుకు టౌన్: బాలికలను బాలురతో సమానంగా చదివించాలని, బాలికల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తణుకు ఐసీడీఎస్ సీడీపీఓ ఎంబీఎస్ ప్రమోదిని కుమారి కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక 100 రోజుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా తణుకు రూరల్ మండలం దువ్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల పట్ల వివక్షను విడనాడాలని, 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేస్తే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. బాలికల వివాహ వయస్సు, బాలికలు, మహిళలపై వేధింపుల నివారణపై మాట్లాడారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు రైతు భరోసా కేంద్రం వద్ద మిషన్ శక్తిపై అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి పాల్గొని ఐపీసీ 1860, భారత న్యాయ సంహిత 2023, సీఆర్‌పీసీ–1973 చట్టాల గురించి వివరించారు. పంచాయతీ కార్యదర్శి వై.హరికిషోర్, వీఆర్వో సురేష్, జీఎంఎస్‌కే ఎస్‌పీఎం ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.లక్ష్మి, బి.సుమలత పాల్గొన్నారు.


దువ్వ హైస్కూల్లో కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, విద్యార్థినులు

దర్శిపర్రులో..

పెంటపాడు: బాల్యవివాహాల నిరోధం, పోక్సో చట్టం,తదితర చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. దర్శిపర్రు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ మిషన్ శక్తిపై బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీల భద్రతకు ఎన్నో చట్టాలు రూపొందించిందన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్, స్త్రీల హెల్ప్‌లైన్, బాల్య వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం తదితర విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.


కొండ్రుప్రోలు ఆర్‌బీకేలో మిషన్ శక్తి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి

డెంగీ నివారణకు పరిసరాల శుభ్రతే మార్గం


తణుకులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఏఎంఓ శ్రీనివాసరావు

తణుకు అర్బన్: డెంగీ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పి.శ్రీనివాసరావు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా తణుకు మునిసిపాలిటీ పరిధిలోని ఇంద్రయ్య నగర్‌లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఇంటి పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు అవసరంలేని నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. దోమ విడిచిన లార్వా దోమగా మారాలంటే సుమారుగా 8 నుంచి 10 రోజుల వ్యవధి ఉంటుందని, ఆ కారణంగా వారానికోసారి డ్రైడేగా పాటించి నీటి నిల్వలను తొలగిస్తే దోమగా మారకుండా లార్వా దశలోనే నిరోధించవచ్చని వివరించారు. సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చలి జ్వరం, ఒళ్లునొప్పులు వంటి సమస్యలు ఉన్నప్పుడు తక్షణమే సమీపంలోని వైద్యులను సంద్రపదించాలన్నారు. డెంగీ కారకమైన ఫీమేల్ టైగర్ దోమ పుట్టుకను నివారించే ఖర్చురహిత మార్గం డ్రైడే ఫ్రైడే ఒక్కటేనని అన్నారు. ముందుగా డెంగీపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీ వి.రాజకుమారి, హెల్త్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

తేరుకుంటున్న వరి నాట్లు


స్కిన్నెరపురంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ రాజేష్

అత్తిలి: ముంపు నుంచి వరినాట్లు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. శుక్రవారం అత్తిలి మండలం స్కిన్నెరపురం గ్రామంలో ముంపుబారిన పడిన వరినాట్లు, నారుమడులను ఆయన పరిశీలించారు. ముంపు నుంచి కోలుకున్న వరికి ఎకరానికి 15 కిలోల యూరియా, 20 కిలోల ఎంఓపీ వేసుకోవాలని సూచించారు. మొక్క నిలదొక్కుకున్న తరువాత 2 గ్రాముల కార్బెండిజమ్, మాంకొజేబ్ మిశ్రమాన్ని పైపాటుగా పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల బెడద తగ్గుతుందని చెప్పారు. రైతులు ప్రస్తుతం స్వల్పకాలిక (120 రోజులు) వరి వంగడాలను వేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ రూప, రైతులు పాల్గొన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి


కె.సముద్రపుగట్టులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

అత్తిలి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కాచి చల్లార్చిన నీటినే తాగాలని స్థానిక పీహెచ్ సీ డాక్టర్ కె.నాగరాజు సూచించారు. శుక్రవా రం అత్తిలి మండలం కె.సముద్రపుగట్టు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కు మారి మాట్లాడుతూ బాల్యవివాహాలు వల్ల అనేక అనర్థాలు సంభవిస్తాయని వివరించారు. బాల్యవివాహాలకు బాధ్యత వహించిన వారికి జైలు శిక్ష పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది ఎస్ దీపికారాణి, పూర్ణగిరి, నవోమి, మహిళా సంరక్షణ అధికారిణి భవాని, ఏఎన్ఎం విజయకుమారి, ఆశావర్కర్లు లక్ష్మి, రమ్య తల్లిదండ్రులు పాల్గొన్నారు.